క్లుప్తంగా

తాయమ్మవ్వకు విశేష పూజలు


తాయమ్మకు మంగళ హారతి ఇస్తున్న పూజారి

ఆదోని టౌన్: దసరా శరన్నవ రాత్రులు, అష్టమిని పురస్కరించుకుని శిల్పా ఎస్టేట్‌లో వెలిసిన శ్రీ తాయమ్మవ్వకు గురువారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన పంచాయతీరాజ్ ఈఈ


సబ్‌కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు

ఆదోని రూరల్: ఆదోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సబ్‌కలెక్టర్ నూతన పంచాయతీరాజ్ ఈఈకి పలు సూచనలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

5,6 తేదీల్లో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలు

ఆదోని సెంట్రల్: నవంబర్ 5,6 తేదీల్లో కర్నూలు జిల్లా 30వ మహాసభలను ఆదోని పట్టణంలో నిర్వహించనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు బి. గిడ్డయ్య తెలిపారు. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా మహాసభల ఆహ్వానం సంఘం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయన్నారు. నూతన విద్యావిధానం పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు ధారదాత్తం చేస్తూ కషాయీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు. పాఠ్యపుస్తకాల్లో శాస్త్రీయ భావాజలాన్ని తొలగించి అశాస్త్రీయ భావాలను చేర్చి విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. విద్యార్థులను జీవితాలను మెరుగు పరచాల్సిన ప్రభుత్వాలు అజ్ఞానంలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, మేధావులు, వ్యాపారవేత్తలు సహకరించి ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పోషకాహారం పంపిణీ


పోషకాహార కిట్లను అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి

ఆదోని టౌన్: ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆస్పత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి చేతుల మీదుగా టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రముఖ ఉపాధ్యాయుడు నిరంజన్‌కుమార్ ఆదోని పట్టణంలోని 10 మంది పేద క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వారికి రూ.1000 విలువ గల పోషకాహారం అందించడం అభినందనీయమన్నారు. ఆయన ఆరు నెలలపాటు పోషకాహార కిట్స్‌ను అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ బాలమురళీకృష్ణ, సిబ్బంది బాలమురళి, బాలరాజు, స్వరూప్‌రాజ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు


ఏపీఎం జయశ్రీని సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

మంత్రాలయం : ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా పనిచేస్తున్న వెలుగు ఏపీఎం జయశ్రీ బదిలీపై వెళ్లారు. ఆమెను వెలుగు సిబ్బంది దుశ్శాలువా, పూల మాలలతో సత్కరించారు. జయశ్రీ సేవలను పలువురు కొనియాడారు. ప్రభుత్వ పథకాలు పాడువు మహిళలకు చేరవేడంలో చురుకుగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీవీకేలు పాల్గొన్నారు.

ప్రసాదం.. పరిమళం

- ఉరుకుందలో ప్రసాదం తయారీలో మార్పులు
- భక్తుల మనోభావాలకు అనుగుణంగా తయారీ
- అన్నదానంలో పప్పు, కర్రీ, సాంబారు తోపాటు పెరుగు వడ్డన
- లడ్డూ, పులిహోర తయారీలో మార్పు


పులిహోర ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది


పెరుగు వడ్డిస్తున్న దృశ్యం

మంత్రాలయం : దేవాదాయ శాఖ పరిధిలో కర్నూలు జిల్లాలోనే ఉరకుంద ఈరన్న స్వామి క్షేత్రం ప్రముఖమైంది. శ్రీశైలం, మహానంది, ఆర్ ఎస్ రంగాపురం క్షేత్రాలు నంద్యాల జిల్లాలో కలవడంతో ఉరకుంద క్షేత్రమే పెద్ద ఆలయంగా మారింది. డిప్యూటీ కమిషనర్ హోదాలో ఉన్న ఏకైక ఆలయం కూడా ఇదే. అయితే హోదా పెరిగినా భక్తుల అభిరుచులకు తావు ఉండేది కాదు. రాజకీయ నాయకుల ప్రమేయంతో ఇక్కడ ఆలయ కార్యకలాపాలకు ఆటంకాలు ఏర్పడేవి. అయితే ఇప్పుడిప్పుడే ఆలయంలో ప్రక్షాళన మొదలైంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అన్నదానం, లడ్డూ ప్రసాదం, పులిహోరా తయారీలో మార్పు తెచ్చారు. దీంతో భక్తుల సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్నప్రసాదంలో కొత్త రుచులు

ఉరకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో నెలకు 15 వేల మందికి పైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. శ్రావణమాసం, కార్తీక మాసాల్లో లక్షలాది మంది భక్తులు అన్న ప్రసాదం తీసుకుంటున్నారు. గతంలో కేవలం స్వామికి సమర్పించి పరమాన్నం, అన్నం, సాంబారు, పెరుగన్నం మాత్రమే వడ్డిస్తూ వచ్చారు. చాలా మంది భక్తులు ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తమయ్యేది. ప్రస్తుతం అన్నదానంలో జీడిపప్పుతో కూడిన పరమాన్నం లేదా చక్కెర పొంగళి, కూరగాయ కర్రీ (వంకాయ, బీరకాయ, దొండకాయ), ఆకుకూర పప్పు, సాంబారు, పెరుగు వడ్డిస్తున్నారు. నాణ్యతతో రాజీపడకుండా వంటలు చేస్తున్నారు.

లడ్డూ ప్రసాదంలో నియమాలు



భక్తులు ఎంతో పవిత్రంగా ఈరన్న స్వామి లడ్డూ ప్రసాదాన్ని స్వీకరిస్తారు. ఏటా 16 లక్షలకుపైగా లడ్డూలు విక్రయమవుతున్నాయి. గతంలో లడ్డూ తయారీకి ఓ విధానమంటూ పాటించే వారు కాదు. కేవలం నెయ్యిలో లడ్డూ బూంది తయారీ చేసుకుని నీళ్లతో లడ్డూ ముద్దలు కట్టే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం లడ్డూ తయారీకి పూర్తిగా విజయ డెయిరీ నెయ్యి వినియోగిస్తున్నారు. లడ్డూ ముద్దలు కట్టేందుకు నీళ్లకు బదులుగా నెయ్యిని వాడుతున్నారు. అలాగే ప్రతి లడ్డూలోనూ యాలకులు, జీడిపప్పు ఉండేలా చూస్తున్నారు.

రుచికరంగా పులిహోర



పులిహోర ప్రసాదంలోనూ మార్పు తీసుకువచ్చారు. గతంలో పులిహోరకు వేరుశనగ విత్తనాలు, ఎండుమిర్చి, చింతపండు రసం సరిగెతో తయారు చేసేవారు. ప్రస్తుతం శ్రీశైలం ఆలయం తరహాలో పులిహోర తయారీకి చర్యలు చేపట్టారు. కచ్చితంగా పదార్థాలను పరిమాణాల నియమాలు పాటిస్తున్నారు. గతంలో పచ్చిమిరపకాయ వేపుడు జోడించకుండా తయారు చేసేవారు. ప్రస్తుతం పచ్చిమిరపకాయను జోడించారు. రుచికరంగా ప్రసాదాలు ఉండటంతో భక్తులు ప్రసాదాల కొనుగోలు సుముఖత చూపుతున్నారు.

నాణ్యతలో రాజీపడకుండా ప్రసాదాలు



ప్రసాదాల తయారీలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రమాణాలు పాటిస్తున్నాం. గతంలో భక్తులు లడ్డూ, పులిహోరా విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం పూర్తిగా లడ్డూనూ విజయ డెయిరీ నెయ్యితో జీడిపప్పు, యాలకులు జోడించి చేయిస్తున్నాం. అలాగే పులిహోరలోనూ నాణ్యత, రుచి, శుచి పాటిస్తున్నాం. భక్తుల నుంచి మంచి స్పందన వస్తోంది. అన్నదానంలోనూ సరికొత్తగా ఆకుకూర పప్పు, కూరగాయల కర్రీ, చక్కెర పొంగళి, సాంబారు, పెరుగు వడ్డిస్తున్నాం. భక్తులకు పసందైన విందు వడ్డించేందుకు చర్యలు తీసుకున్నాం.

–ఎం.విజయరాజు,డిప్యూటీ కమిషనర్, ఉరకుంద క్షేత్రం

ఆరోగ్యమే మహాభాగ్యం


మాట్లాడుతున్న జడ్జి యజ్ఞ నారాయణ

ఆదోని రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. గురువారం 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా వివేకానంద కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యం బాగుంటే అన్నీ సాధించవచ్చన్నారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీరాములు, మానసిక నిపుణులు వెంకటసుబ్బయ్య, చైతన్య, న్యాయవాదులు లోకేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరులో అక్టోబర్ 15వ తేదీన జరిగే కాటి కాపరుల జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌జీ కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బి.తిక్కన్న అధ్యక్షతన నిర్వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి ఎస్‌జీ కృష్ణ మాట్లాడుతూ.. శ్మశానాల్లో కాటి కాపరి వృత్తినే నమ్ముకొని ఉన్న వారికి సొంతిల్లు, పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యల బ'స్టాప్'


గోనెగండ్ల ఆర్‌టీసీ బస్టాప్

- కనీస సౌకర్యాల కల్పనలో ఆర్‌టీసీ విఫలం
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

గోనెగండ్ల: ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఓవైపు ఆర్టీసీ సర్దుబాటు పేరుతో టికెట్ ధరలు పెంచుతూ, మినిమం టికెట్‌లో సౌకర్యాల నిమిత్తం సెస్ వసూలు చేస్తున్నా సౌకర్యాల కల్పనపై దృష్టి సారించడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలో గోనెగండ్ల బస్టాండ్, పుట్టపాశం, వేముగోడు తదితర గ్రామాల్లో బస్‌షెల్టర్లు గ్రామాలు ఉన్నాయి. ప్రజలకు ఎండ, వర్షాల నుంచి రక్షణ కొరకు బస్సు షెల్టర్లు, బస్టాండ్ నిర్మించారు. అయితే ఇక్కడ మౌలిక వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు వినియోగిచడంలేదు. ప్రస్తుతం షల్టర్లు శిథిలావస్థకు చేరాయి. గోనెగండ్ల బస్టాండ్‌లో క్యాంటిన్, పండ్ల, పూల దుకాణాల నుంచి అద్దె వస్తున్నప్పటికి సౌకర్యాలు కల్పించడంలేదు. ఇప్పటికైన ఆర్‌టీసీ అధికారులు ప్రయాణికుల సమస్యలు దృష్టిలో ఉంచుకొని గోనెగండ్ల బస్టాండ్ మరమ్మతులతో పాటు తాగునీటి, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



గోనెగండ్ల మండలానికి వివిధ గ్రామల నుంచి ప్రజలు నిత్యం వస్తునే ఉంటారు. అయితే గ్రామాల నుంచి వచ్చె ప్రజలు కర్నూలు, ఎమ్మిగనూరు వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్‌కు మరమ్మతులు చేయిస్తే ప్రయాణికులు బస్టాండ్‌లో వేచి వుండి బస్సు ఎక్కి వెళ్లవచ్చు.

– టీ. మురళి నాయుడు, గోనెగండ్ల

సులభ్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి



బస్టాండ్ ఆవరణలో సులభ్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఇబ్బంది ఉండదు. బస్టాండ్ పక్కన ప్రభుత్వ ఆస్పత్రి ఉండడంతో ప్రయాణికులు, వైద్యం కోసం వచ్చే వారికి, గ్రామాల నుంచి వచ్చే వారికి అత్యవసరమైతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


– కరుణాకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు


ఆదోనిలో మహిషాసుర మర్దినిగా వాసవీ మాత


సరస్వతీ అలంకరణలో మంత్రాలయం మంచాలమ్మ


మహిషాసుర మర్దినిగా ఆదోని ఫారెస్ట్ లైన్ అంభాభవానీ


ఆదోనిలో దుర్గామాతగా దర్శనమిస్తున్న గంగాభవానీమాత


ఆదోనిలో బఠానీలతో వీరభద్రేశ్వరస్వామికి అలంకరణ

జయ జయ జయహే.. మహిషాసురమర్దిని

ఆదోని అర్బన్: శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గవ్వల అలంకారంలో ఆదోని ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ, మహిషాసురమర్దిని అలంకారాల్లో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి, ఫారెస్ట్‌లైన్ అంబాభవానీమాత, దుర్గామాతగా ఎమ్మిగనూరు రోడ్డులోని గంగాభవానీదేవి, బఠానీల అలంకారంలో శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి వార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామంలో వెలసిన అంబాభవానీ ఆలయంలో కాళికాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని నెట్టేకల్ గ్రామానికి వెళ్లే రహదారిలో వెలిసిన దొండు మారెమ్మవ్వ వారు కాళీమాత అలంకరణలో దర్శనమిచ్చారు.


ఆదోనిలో కాళికాదేవి అలంకరణలో అంభాభవానీ


ఆదోనిలో కాళీమాతా అలంకరణలో కొలువుదీరిన దొండు మారెమ్మవ్వ


ఉప్పరహాల్‌లో దుర్గాదేవి అలంకరణలో మారెమ్మవ్వ

సరస్వతీ అలంకరణలో మంచాలమ్మ

మంత్రాలయం: మంత్రాలయం గ్రామ దేవత మంచాలమ్మ సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మంచుకొండల్లో వెలసిన సరస్వతీ మాతగా విశేషంగా అలంకరించారు. అలాగే కౌతాళం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో వెలసిన మారెమ్మవ్వ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

శాస్త్రోక్తంగా ప్రత్యేక హోమాలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో ప్రత్యేక హోమాలు చేపట్టారు. వాసవీ కల్యాణ మంటపంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరణ చేశారు. పురోహితులు గౌతంస్వామి ఆధ్వర్యంలో మహాకాళి, మహాలక్ష్మి, సరస్వతీ హోమాలు శాస్త్రోక్తంగా గావించారు.

పెద్దకడబూరు: చౌడేశ్వరిదేవి ఆలయంలో దుర్గామాతాగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారు కొలువయ్యారు. మండల కేంద్రంలోని కాళీమాత, పెద్ద లక్ష్మమ్మవ్వ, మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో వెలసిన పార్వతీదేవి అమ్మవార్లు వివిధ రూపాలలో భక్తులకు ఆకట్టుకున్నారు.

దుర్గాదేవిగా అమ్మవారు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వీవర్స్ కాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవి దేవి రూపంలో అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. అదేవిధంగా శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తేరుబజారులో శ్రీరామలింగేశ్వర చౌడేశ్వరి ఆలయంలో, వేదగాయిత్రీ దేవి ఆలయంలో, తేరు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారు, అంబాభవాని ఆలయాలతో పలు ఆలయాల్లో పలు అలంకారాల్లో అమ్మవారు కొలువుదీరారు.

నందవరం: మండల కేంద్రంలోని బంగారమ్మ దేవి, సోమలగూడూరులో పెద్దమ్మ దేవి అమ్మవార్లకు భక్తులు దుర్గా దేవి అలంకరణ గావించారు. పురోహితులు శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశిష్ట పూజలు చేపట్టారు. పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ గావించారు.


పెద్దకడబూరులో దుర్గామాతాగా చౌడేశ్వరిదేవి


ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో దుర్గాదేవిగా..


ఎమ్మిగనూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


సోమలగూడూరులో దుర్గాదేవి అలంకరణలో పెద్దమ్మ దేవి


నందవరంలోని దుర్గాదేవి అలంకరణలో బంగారమ్మ దేవి

ఎస్‌జీఎఫ్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు (టౌన్): తిరుపతి పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. క్రీడాకారులు విశాల్, నవీన్, వెంకట శివరాం, కార్తీక్ వెండి పతకాలు, అఖిల్, మోహన్‌కుమార్, శ్యాం సుందర్ కాంస్య పతకాలు సాధించారు. నిర్వాహకులు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తైక్వాండో మాస్టర్ సతీష్‌కుమార్ అభినందించారు. స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కు, ఏపీఎస్‌పీ క్యాంపు, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని అర్బన్/సెంట్రల్: కంప్యూటర్ బేసిక్స్ మరియు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం స్థానిక ఫెయిత్‌హోంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ చేతులమీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్ బేసిక్ కంప్యూటర్ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్క కంపెనీ ఉద్యోగాల్లో కూడా ఇంగ్లిష్‌తో పాటు కంప్యూటర్ నేర్చుకున్న యువతీ యువకులను ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఫెయిత్ హోం నిర్వాహకులు డాక్టర్ డానియల్ ప్రేమ్‌కుమార్ సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు ఆరేకల్ దేవదాసు, పీపుల్స్ పాఠశాల స్టాఫ్ మనోజ్, శాజియా, ఉషారాణి, సుమం, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన


మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యార్థినులకు శిక్షణ

మంత్రాలయం : మండలంలోని రచ్చుమర్రి ఏపీ ఆదర్శ పాఠశాలలోని 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వృత్తివిద్యపై అవగాహన కల్పించారు. సర్వశిక్ష అభియాన్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ ప్రసాద్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో అవగాహక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాధవరం సబ్ స్టేషన్, ఎమ్మిగనూరులోని ఐటీఐ కళాశాల, సాఫ్టమె కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్, ఇమామ్ ఎలక్ట్రికల్స్, ద్వారకమయి ఫ్లెక్సీ కేంద్రాల్లో ఇంటర్న్ షిప్ చేపట్టారు. విద్యార్థులకు ఆయా రంగాలపై అవగాహన కల్పించారు. ఇండస్ ఒకేషనల్ కో–ఆర్డినేటర్ కృష్ణ చైతన్య తనిఖీ నిర్వహించారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తివిద్య శిక్షణ

గోనెగండ్ల : వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్ ఆటో మోటివ్ విద్యార్థులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ షాహీనా పర్వీన్, వృత్తి విద్యా కోర్సు సమన్వయకర్త మద్దిలేటి, ఆటోమోటివ్ వృత్తి విద్య అధ్యాపకుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే పిల్లల్లో నైపుణ్యం పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే 10వ తరగతి విద్యార్థులకు ఇండస్ట్రీయల్ విజిట్ చేసినట్లు తెలిపారు.

మద్యం దుకాణాలకు 39 దరఖాస్తులు

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల కోసం గురువారం ఒక్కరోజే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్లో 39 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.ఇప్పటి వరకు మొత్తం 222 దరఖాస్తులు వచ్చాయని,శుక్రవారంతో మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడవు ముగుస్తుందని తెలిపారు.దరఖాస్తులు పెరిగేఅవకాశం ఉందన్నారు.

భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించండి

మంత్రాలయం : ప్రసిద్ధ మంత్రాలయం క్షేత్రంలో భక్తుల ప్రాణాలు రక్షణ కరువైందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ ఆరోపించారు. తుంగ భద్ర నదీ తీరంలో భక్తుల పుణ్యస్నానాలకు రక్షణ కల్పించాలని డిప్యూటీ తహసీల్దార్ గురురాజ రావుకు వినతిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీమఠానికి హుండీలు, లాడ్జీల ఆదాయాలపై ఉన్న ఆసక్తి భక్తుల ఏర్పాట్లపై లేదని విమర్శించారు. శ్రీమఠంలో అడుగడుగునా హుండీలు పెట్టారుగానీ నదీ తీరంలో ఒక్క ఏర్పాటు లేదన్నారు. ఏటా భక్తులు నదీ తీరంలో పుణ్యస్నానాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా శ్రీమఠం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం చిక్‌బళ్లాపూర్ జిల్లాకు చెందిన సుబ్బరాయప్ప స్నానికి వెళ్లి నదిలో గల్లంతు కావడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి లక్ష్మన్న నాయక్, ఈరన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించాలి

నందవరం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో ఉపాధి పనులు గుర్తించాలని ఏపీఓ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణాలో ఉపాధి కూలీల 90 రోజుల పని దినాలను పూర్తి చేయాలని సూచించారు. వివిధ స్టేజ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో నూర్జహాన్, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోలుకోలేక యువతి మృతి


నయోమి(ఫైల్)

నందవరం:మండల పరిధిలోని మాచాపురం గ్రామానికి చెందిన కీలు నయోమి (17) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు .. కీలు పద్మమ్మ, రాజేష్ దంపతుల కుమార్తె నయోమికి కండరాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఉండేది. గత నాలుగు నెలల కింద కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కండరాళ్ల నొప్పికి చికిత్స తీసుకుంది. అయితే నొప్పులు తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 1వ తేదీన ఇంట్లో గ్యాస్ పోయికి నిప్పుపంటించుకుంది. బంధువులు గమనించి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృత్యువాత పడింది. మృతురాలి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు: విజయవాడ వరద ప్రాంతాల్లో కార్మికులు చేపట్టిన పారిశుద్ధ్య పనులు ప్రశంసనీయమని ఎమ్మెల్యే డాక్టర్ బి జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెండు జతల దుస్తులను పంపిణీ చేశారు. వరద సహాయక చర్యల్లో పాల్గొన్న 50 మంది కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.గంగిరెడ్డి, అధికారులు, కౌన్సిలర్‌లు, తదితరులు పాల్గొన్నారు.